నమస్తే తెలంగాణ
నిజామాబాద్
8 | నిజామాబాద్, సోమవారం 2 జూన్ 2025 | NIZAMABAD

ధాన్యం సేకరణలో రేవంత్ సర్కార్ విఫలం

తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు తప్పని కష్టాలు
- కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై మూడునెలలవుతున్నా ఇంకా రోడ్లపై ధాన్యపు రాసులు
- అకాల వర్షాలకు తడిసి మొలకెత్తుతున్న వడ్లు
- ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా సర్కారే కొనుగోలు చేయాలి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్,
జూన్ 1 : కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా ఇంకా పూర్తిస్థాయిలో వడ్లు కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. వేల్పూర్ మండలంలోని పడిగెల్ గ్రామంలో రోడ్లపై వర్షాలకు తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని అక్కడి రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. 15 రోజుల నుంచి ఎదురు చూస్తున్నా ఇంకా తమ వడ్లను కొనుగోలు చేయడంలేదని రైతులు.. వేముల ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. రేవంత్ ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనుగోలు చేయకపోవడంతో ఎక్కడికక్కడ కల్లాలు, రోడ్లపై వడ్లు అలాగే ఉండడంతో అకాల వర్షాలకు తడిసి మొలకలు రావడంతో పూర్తిగా పనికి రాకుండా పోయాయన్నారు. తడిసిన ధాన్యాన్ని అటు ప్రభుత్వం ఇటు వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో కిలో నాలుగైదు రూపాయలకు రైతులకు విక్రయించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనంతోనే రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్ రెడ్డికి అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ రైతులపై లేదని విమర్శించారు. అందాల పోటీల కోసం ఎనిమిదిసార్లు అధికారులతో సమీక్ష చేసిన సీఎం రేవంత్.. పంటల కొనుగోలుపై సమీక్ష చేసే సమయం లేదా అని ప్రశ్నించారు.

తడిసిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

నెల రోజులుగా బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి పంటలను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా ముఖ్యమంత్రికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారులు, మిల్లర్లపై ఎలాంటి నియంత్రణ లేదని ఎద్దేవా చేశారు. సరైన సమయంలో వడ్లు కొనుగోలు చేసి ఉంటే రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. తడిసిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వేముల డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసినట్లు గుర్తుచేశారు. అయినా ఆనాడు నిరాధారంగా అడ్డగోలు విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు మరి ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలి: కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే వేముల

తడిసి, మొలకలు వచ్చిన ధాన్యం పరిశీలిస్తున్న సమయంలో ఆదివారమే కొనుగోలు చివరిరోజు అని, సోమవారం నుంచి కొనుగోలు చేయబోమని అధికారులు అంటున్నారని పలువురు రైతులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వేముల వెంటనే అక్కడి నుంచే కలెక్టర్‌కు ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. పడగల్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం కొనసాగుతున్నదని, మరో మూడు నాలుగు రోజులు సెంటర్ అలాగే కొనసాగించి పూర్తి ధాన్యం కొనుగోలు అయ్యేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. రేపటి నుంచి వడ్లు కొనుగోలు చేయబోమంటూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్న ఐకేపీ అధికారిని ఎమ్మెల్యే మందలించారు. ఇలా చేస్తే మీ మీద యాక్షన్ తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

'పసుపు'పై అనాసక్తి !

నిజామాబాద్‌లో తగ్గిన సాగు విస్తీర్ణం

మద్దతు ధరనే కీలకం...

పసుపు పంటకు క్వింటాలుకు కనీసం రూ.15వేలు మద్దతు ధర కల్పించాల్సిన అనివార్యత ఏర్పడింది. తొమ్మిది నెలల పాటు సాగయ్యే పసుపు పంటపై రైతుల పెట్టుబడి ఎకరానికి దాదాపుగా రూ.లక్ష దాటుతున్నది. ప్రతి ఏటా కొత్త సంవత్సరం ప్రారంభంలో మార్కెట్‌కు పసుపును అమ్ముకునేందుకు వెళ్తే మద్దతు ధర లభించడంలేదు. అరకొరగా క్వింటాలుకు రూ.8వేల నుంచి రూ.10వేలలోపే మద్దతు ధర దొరుకుతోంది. దీంతో రైతులంతా నష్టాల బాట పడుతున్నారు. పసుపు పంటను సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో రైతులు నిట్టూరుస్తున్నారు. దీంతో గతి లేక ఇతర పంటల సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. వానకాలంలో వరి పంట సాగు చేసేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. సన్న రకం వరి సాగు చేసి రూ.500 అదనంగా బోనస్ దక్కించుకోవచ్చని రైతులు భావిస్తున్నారు. పసుపు పంటకు సైతం బోనస్‌ను వర్తింపజేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. 2019 ఎన్నికల సమయంలో క్వింటాలు పసుపునకు రూ.15వేలు కనీస మద్దతు ధర కల్పిస్తామంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పష్టమైన హామీ ఇచ్చారు. కానీ అమలును గాలికి వదిలేశారు. తాము అధికారంలోకి వస్తే క్వింటాలు పసుపునకు రూ.12వేలు మద్దతు ధర అందిస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పేర్కొనగా అమలుకు మోకాలడ్డుతోంది. ఇచ్చిన హామీలకు బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పంగనామాలు పెట్టడంతో రైతులంతా చేసేది లేక ఇతర పంటలను సాగు చేయాల్సి వస్తోంది. తద్వారా ప్రసిద్ధమైన పసుపు పంట సాగు గణనీయంగా పడిపోవాల్సి వస్తోంది. పసుపు సాగు సీజన్ ఆరంభమవుతున్న ఈ సమయంలో ప్రభుత్వాలు కండ్లు తెరిచి రైతులకు బాసటగా నిలిస్తే పసుపు సాగు పెరిగే వీలుంది.

- వ్యవసాయ శాఖ అంచనాల్లో తేటతెల్లం
- 20వేల ఎకరాలకే పరిమితం కానున్న వైనం
- పసుపు బోర్డు ఏర్పాటుతో కానరాని ప్రయోజనం
- ఇతర పంటల వైపు పసుపు రైతుల చూపు

నిజామాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా పసుపు పంటకు ఎంతో ప్రసిద్ధి. ఇక్కడి రైతులు ఎక్కువగా పసుపు పంటను సాగుచేస్తారు. కానీ ప్రస్తుతం పసుపు రైతులు ఇతర పంటల వైపు ఆసక్తి చూపుతున్నారు. దశాబ్దాలుగా పసుపు పంట సాగులో ఆరితేరిన రైతన్నలంతా ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టి సారిస్తున్నారు. ఫలితంగా పసుపు పంట సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గి పోతున్నది. వానాకాలం సాగు అంచనాలను వ్యవసాయ శాఖ విడుదల చేసింది. ఇందులో పసుపు సాగు కేవలం 20వేల 120 ఎకరాలకే పరిమితం కానున్నదని పేర్కొనడం గమనార్హం. ఒకప్పుడు 50వేల ఎకరాల్లో పండించిన పసుపు పంట ఇప్పుడు సగానికి కన్నా తక్కువకు పడిపోవడంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఆరుగాలం శ్రమించిన రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. 2024 వానకాలంలో 22వేల 941 ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం గణనీయంగా తగ్గిపోయింది. కేసీఆర్ పాలనలో పసుపు సాగు సుమారు 40వేల ఎకరాల వరకు కొనసాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పసుపు రైతుల్లో నిరాశ అలుముకున్నది. ఇందుకు రైతుభరోసా లేకపోవడం, పసుపు పంటకు బోనస్ వర్తించకపోవడం, క్వింటాలు పసుపునకు సరైన మద్దతు ధర లభించకపోవడమే ప్రధాన కారణాలుగా నిలుస్తున్నట్లుగా తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లా పసుపు పంటకు ఎంతో ప్రసిద్ధి. అలాంటి పసుపు పంట కనుమరుగు అయ్యే ప్రమాదానికి నోచుకుంటుండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయి.

ధీమా కల్పించని పసుపు బోర్డు...

జనవరి 14న సంక్రాంతి రోజున నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో జాతీయ పసుపు బోర్డును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఊరూ పేరు లేకుండానే తాత్కాలిక సర్దుబాటుతో పసుపు బోర్డు నెలకొల్పినప్పటికీ గడిచిన నాలుగైదు నెలల్లో రైతులకు ధీమా కల్పించడంలో పసుపు బోర్డు చొరవ ఎక్కడా కనిపించడం లేదు. పసుపు ఆధారితర పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపుతున్నట్లు ప్రకటనలు విడుదల చేస్తున్నప్పటికీ సాగు ప్రోత్సాహకాలను మాత్రం అందివ్వడం లేదు. జిల్లాలోని అంకాపూర్ గ్రామానికి చెందిన పల్లె గంగారెడ్డిని జాతీయ పసుపు బోర్డుకు చైర్మన్‌గా కేంద్రం నియమించింది. బోర్డు కార్యదర్శిగా ఐఏఎస్ అధికారిణి భవానిశ్రీ బాధ్యతలు చేపట్టారు. పసుపు బోర్డు ఏర్పాటైన తర్వాత హోటళ్లలో స్టేక్ హోల్డర్లు, పసుపు ఆధారిత పరిశ్రమదారులతో సమావేశాలు నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పసుపు సాగు పడిపోతుండడంపై పసుపు బోర్డు దృష్టి సారించకపోవడంతో రైతుల్లో విస్మయం వ్యక్తం అవుతోంది. సాగు విస్తీర్ణం పడిపోవడంతో ఉత్పత్తి గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉంది. అలాంటప్పుడు పసుపు ఆధారిత పరిశ్రమలు స్థాపిస్తే ప్రయోజనం ఏమిటి? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పసుపు విస్తీర్ణం తగ్గుతున్నప్పటికీ రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు కనీసం చీమ కుట్టినట్లు కూడా స్పందించడం లేదు. కేంద్రంలోని బీజేపీ సర్కారు సైతం పట్టించుకోవడం లేదు.

పసుపు రైతులకు ప్రోత్సాహకాలు లేవు

పసుపు సాగు చాలా క్లిష్టమైంది. సీజనల్‌గా వచ్చే తెగుళ్ల నుంచి పంటను సంరక్షించుకుంటూ 9నెలల పాటు సాగు కష్టాలు పడాల్సి వస్తుంది. ఎకరా పంట పెట్టుబడి రూ.లక్షన్నర దాకా అవుతోంది. పసుపు పంట అమ్ముకున్న తర్వాత రూ.లక్ష కూడా రావడం లేదు. నష్టాలు రావడంతో ఇతర పంటల వైపు దృష్టి పెట్టాల్సి వస్తోంది. పసుపు పంటకు రూ.500 బోనస్ కల్పించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

- కొండ అశోక్, పసుపు రైతు, కిసాన్‌నగర్, బాల్కొండ మండలం

రైతుకు ధీమాను కల్పించే చర్యలేవి?

జాతీయ పసుపు బోర్డు వచ్చింది. కానీ రైతులకు ఎలాంటి ప్రయోజనమైతే ఇప్పటి వరకు దక్కడం లేదు. పసుపు పంట సాగును ప్రోత్సహించే చర్యలు కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. పసుపు పంట సాగుతో నష్టాలు వస్తున్నాయి. ఏటా అప్పుల బారిన పడుతున్నాం. అందుకే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని నిశ్చయించుకున్నాం. గత సీజన్‌లో రెండెకరాల్లో పసుపు సాగు చేశా. పరిస్థితుల కారణంగా ఇప్పుడు ఒక ఎకరానికే పరిమితం అవుతున్నాను.

- రెంజర్ల మహేందర్, పసుపు రైతు, కమ్మర్‌పల్లి

ఇండ్ల జాబితాలో పేర్లు గల్లంతుచేశారు..

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

బీర్కూర్ మండల కేంద్రంలో రాస్తారోకో

నస్రుల్లాబాద్, జూన్ 1: ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తమ పేర్లు గల్లంతయ్యాయని కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో పోచారం కాలనీ వాసులు ఆదివారం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నామని తెలిపారు.మొదటి జాబితాలో తమ పేర్లు రాగా అప్పుచేసుకుని మరీ ఇండ్లు కట్టుకున్నట్లు తెలిపారు. ఇటీవల విడుదలైన జాబితాలో తమ పేర్లను గల్లంతు చేశారని ఆరోపించారు. జాబితాలో అనర్హులను తొలగించి అర్హులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని నిరాహార దీక్ష

దీక్షలో కూర్చున్న ధర్యాపూర్ కాలనీవాసులు

నవీపేట,జూన్ 1: తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పేదలు ఆదివారం నిరాహార దీక్ష చేపట్టారు. మండల కేంద్రంలోని ధర్యాపూర్, నవీపేటలో ఎంతో మంది పేదలకు సొంత స్థలాలు ఉన్నా వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. దీక్షలో ధర్యాపూర్‌కాలనీకి చెందిన నర్సింహులు మాట్లాడుతూ తనకు సొంత స్థలం ఉన్నా ఇల్లు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు.

ఈ రోడ్డు బాగుపడేదెన్నడూ?

నిజామాబాద్ జిల్లా కేంద్రం శివారు ఒకటో వార్డు పరిధిలో ఉన్న కాలూరు రోడ్డు అధ్వానంగా మారింది. కాలూరు నుంచి జిల్లా కేంద్రం వరకు రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలూర్, ఖానాపూర్ పారిశ్రామిక ప్రాంతాలు కావడంతో రోజుకు వందల సంఖ్యలో లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రోడ్డుపై గుంతలు ఏర్పడి కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వాటిలో నీరు నిలిచిపోవడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

విద్యుద్దీపాల కాంతుల్లో కామారెడ్డి కలెక్టరేట్

కంఠేశ్వర్/వినాయక్‌నగర్, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ కోసం ఉమ్మడి జిల్లా సిద్ధమైంది. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి టీఆర్ఎస్ స్థాపనతో తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించి 14 ఏండ్ల సుదీర్ఘ ఉద్యమం తర్వాత గమ్యాన్ని ముద్దాడారు. శాంతియుత మార్గంలో తెలంగాణ సాధించి తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను సాకారం చేశారు. నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నారు. నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించి వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర అవతరణ వేడుకల్లో లోటుపాట్లకు తావు లేకుండా పరేడ్ మైదానాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. కలెక్టరేట్లను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించే కార్యక్రమాల నేపథ్యంలో బందోబస్త్ ఏర్పాట్లను సీపీ సాయి చైతన్య ఆదివారం పర్యవేక్షించారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా భద్రతా ఏర్పాట్లు నిర్వహించాలని సంబంధిత అధికారులను సీపీ ఆదేశించారు.

దర్జాగా మొరం దందా

- అక్రమ తవ్వకాలతో మాయమవుతున్న గుట్టలు
- ఇందల్వాయి మండలంలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

గన్నారం శివారులో గుట్టను తవ్వేసిన అక్రమార్కులు

ఇందల్వాయి, జూన్ 1: జిల్లాలో ఇసుకతోపాటు మొరం దందా జోరుగా సాగుతున్నది. అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇందల్వాయి మండలంలో కొందరు అక్రమార్కులు ప్రకృతి వనరులను కొల్లగొడుతూ సొమ్ము చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఇప్పటికే ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వారు.. మొరంపైన కూడా కన్నేశారు. గుట్టలను మాయం చేస్తూ మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు. ఇది సంబంధిత అధికారుల దృష్టికి వచ్చినా వారు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

ఇందల్వాయి మండల కేంద్రంలో కొంత కాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడంతో పలువురు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ప్లాట్లుగా మారుస్తున్నారు. ఆ ప్లాట్లల్లో మొరం వేసి రోడ్లు వేస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం రెవెన్యూ భూముల్లో మొరం తవ్వకాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలి. ఇందుకోసం కొంత రుసుము చెల్లించాలి. అలాగే గ్రామ పంచాయతీ భూముల నుంచి మొరం తరలిస్తే రుసుము చెల్లించి అనుమతి తీసుకోవాలి. రైతుల పట్టా భూముల నుంచి మొరం తరలించినా రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తప్పనిసరి. కానీ మొరం వ్యాపారులు ఈ నిబంధనలు గాలికి వదిలి ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. దీంతో ఆయా శాఖలకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. మొరం అక్రమ తవ్వకాలు కండ్ల ముందే చేపడుతున్నా అధికారులు కట్టడి చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గుట్టలను తవ్వుతున్నారు...

మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల శివారులోనూ గుట్టల నుంచి పెద్ద ఎత్తున మొరం తరలిస్తుండడంతో గుట్టలు కనుమరుగవుతున్నాయి. మరోవైపు గుట్టలను తవ్వేస్తూ వ్యవసాయ భూములుగా మార్చుకుంటున్నారు. దీంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గ్రామ పంచాయతీ పరిధిలో గుట్టల తవ్వకాలు కొనసాగుతుండడం గమనార్హం.

ఒక్కో ట్రాక్టర్‌కు రూ.500 వసూలు

గుట్టలను కొల్లగొడుతూ మొరం అక్రమంగా తరలిస్తూ అక్రమార్కులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ మొరం రూ. 300 నుంచి రూ. 500 వరకు విక్రయిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు మొరం తవ్వకాలు చేపట్టి ప్లాట్లను చదును చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి మొరం తవ్వకాలను ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం

మొరం అక్రమ తవ్వకాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. రాత్రివేళలో మొరం అక్రమ తవ్వకాలు ఎవరైనా చేపడితే మాకు సమాచారం ఇవ్వాలని ఆయా గ్రామాల వీఆర్ఏలకు సూచించాం. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

-వెంకట్‌రావు, తహసీల్దార్